క్లుప్తంగా

శివరామాంజనేయ పూజలు



పాన్‌గల్: మండలంలోని అన్నారం శివరామాంజనేయ ఆలయ మహోత్సవం వేడుకలు కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం పంచామృత అభిషేకాలు, మంగళహారతి, కుంకుమార్చన, మంత్ర శిల్ప హోమాలు వంటి కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మహోత్సవాలకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్నదాన కార్యక్రమాలు, నీటి వసతిని నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

నవగ్రహ విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని పెద్ద గూడెం గ్రామంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రామలింగేశ్వర ఆలయంలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ, ఉత్సవ మూర్తులకు మంగళవారం ఉదయం అర్చకులు మంటపారాధన, అగ్నిప్రతిష్ఠ, ప్రధాన అహనములు నూతన ఉత్సవ విగ్రహాల ప్రాణపతిష్ఠ జరిపించారు. సాయంత్రం మంటపారాధన, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



పాన్‌గల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఐకేపీ ఏపీఎం సక్రూనాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే ధాన్యం విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని ఆయన గ్రామ సంఘం సభ్యులకు సూచించారు. తేమ శాతాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ నాగరాజు, కొనుగోలు కమిటీ సభ్యులు అలివేలు, షేక్ మహేమూదబేగం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కొత్తకోట రూరల్: కానాయపల్లి శివారులో గల దత్తకోటిలింగేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం ఆదిదంపతులు శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తుల మధ్య శివపార్వతుల కల్యాణం కనులపండువగా జరిగింది. శివపార్వతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా ఆడపడుచులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. ఆలయంలో జరుగుతున్న కల్యాణానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలు

పెబ్బేరు రూరల్: మండల కేంద్రానికి చెందిన వెంకటేష్ కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. అధికారుల ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పట్టణంలో కుక్కల సమస్య రోజు రోజుకూ తీవ్రమైంది. దీంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరారు.

బీజేపీకే మళ్లీ అధికారం

ఆత్మకూర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకే మళ్లీ అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని మక్తల్ అసెంబ్లీ కన్వీనర్ రేచింత శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిప్పడంపల్లిలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారతదేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, ఈసారి ఎన్నికల్లో 400 సీట్లు సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పరమేష్, తిరుపతి, జగదీష్ పాల్గొన్నారు.

హనుమాన్ జయంత్యుత్సవాలు

వనపర్తి టౌన్: హనుమాన్ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడింది. ఆంజనేయ స్వామి మూలవిరాట్‌ కు అభిషేకాలు నిర్వహించి పుష్పాలు, నిమ్మకాయలు, తమలపాకులతో స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని చింతల ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ఆంజనేయ స్వామి దీక్ష తీసుకున్నారు. వేంకటేశ్వర స్వామి ఆలయంలోని ఆంజనేయ స్వామి, నాగవరంలోని కోదండరామస్వామి, పీర్ల గుట్ట, మర్రికుంటలోని అభయాంజనేయ స్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు. భజరంగ్ దళ్, పలు హిందూ సంస్థల ఆధ్వర్యంలో హనుమంతుడి శోభా యాత్ర చేపట్టారు.

ఆత్మకూర్: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో, శివారులోని మల్లాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, కాంగ్రెస్ నాయకులు రహ్మతుల్లా, పరమేష్, నల్గొండ శ్రీను, తులసీరాజ్, బంగారు భాస్కర్, బాల్‌రాజు, శంకర్‌శెట్టి ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కొత్తకోట రూరల్: మండలంలోని రాయిణిపేట ఆంజనేయస్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి గెలవాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. మోహన్‌రెడ్డి, కుర్మన్న, బాబు, దయాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బండలయ్య, శ్రీను, అశోక్, చాంద్, లింగన్న ఉన్నారు.

అమరచింత: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించి యువకులు బైక్‌ర్యాలీ తీశారు. అమరచింత ఆంజనేయ ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం హనుమాన్ శోభయాత్ర నిర్వహించారు. తాటికొండ విజయ్, తాటికొండ రమేష్, వెంకటరెడ్డి, మనోహర్‌రాజు, జాల్గి నరసింహులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో మంగళవారం హనుమాన్ జయంతి ఉత్సవాలను హనుమాన్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. బెస్తగేరి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామస్తులు హనుమాన్, శ్రీరాముడి విగ్రహాలను వాహనాలపై అలంకరించి గ్రామంలో ఊరేగింపు చేశారు. ఉత్సవాల అనంతరం స్వామి వారి ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

పెబ్బేరు రూరల్: చెలిమిల్ల ఆంజనేయస్వామి ఆలయంలో, వేణుగోపాలస్వామి ఆలయంలో నూతన ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. సాయంత్రం భజనలు, కోలాటాలతో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు.



ఖిల్లాఘనపురంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు



చెలిమిల్లలో..



వనపర్తిలో..

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కొత్తకోట రూరల్: కాంగ్రెస్ పార్టీ పాలనతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు బోయేజ్, కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని పలు వార్డుల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీధర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, రాహుల్‌గాంధీ ప్రధాని అయితే దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. 10ఏళ్ల బీజేపీ పాలనలో సామాన్యుడు సైతం బతుకలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, మిషేక్, యాదయ్యసాగర్, సలీంఖాన్, రాములుసాగర్, సంజీవుడు, లక్ష్మయ్య, భాస్కర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

మదనాపురం: మండలంలోని గోపన్‌పేట ఎంపీటీసీ సభ్యురాలు శారద బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంకట్‌నారాయణ, మాజీ సర్పంచ్ వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు మహమూద్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జగదీష్, హనుమాన్ రావు, రవీందర్ రెడ్డి, ఎంపీటీసీ కురుమయ్య, నెల్విడి విజయ్ ఉన్నారు.

ఆత్మకూర్: మండల మాజీ ఎంపీపీ, బీజేపీ నాయకుడు గంగాధర్‌గౌడ్ మంగళవారం రాష్ట్ర గీతకార్మిక చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీ చందర్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, నల్గొండ శ్రీనివాసులు, రామలక్ష్మారెడ్డి, షబ్బీర్, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



గోపన్‌పేటలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీటీసీ సభ్యురాలు శారద

‘ఉపాధి’లో కూలి పెంచాలి

పెబ్బేర్ రూరల్: పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు రోజు కూలి పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు అన్నారు. మంగళవారం వనపర్తి మండలంలోని అచ్యుతాపురంలో జరుగుతున్న ఉపాధి పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సందర్శించింది. ఈ సందర్భంగా కూలీల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి 200 రోజుల పనిదినాలు కల్పించి, రూ.600కు కూలి చెల్లించాలన్నారు.

సోషల్ ఆడిట్

కొత్తకోట రూరల్: 2023–24 సంవత్సరానికి గానూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు గానూ మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని ప్రొఫెసర్ జయశంకర్ సమావేశ మందిరంలో సోషల్ ఆడిట్ బృందాలు పనుల పురోగతి, వాటి బిల్లులను పరిశీలించారు. ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అక్రమాలు జరిగినా ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి, నిర్వేన్ గ్రామ పంచాయతీలో కార్మికులుగా పనిచేస్తున్న వారికి ఏడు నెలల వేతనాలు ఇవ్వడం లేదంటూ కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. అనంతరం పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలంటూ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరం ఆలోచింపజేస్తుంది

వనపర్తి టౌన్: పుస్తకాలు జ్ఞానానికి ప్రతీకలని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని పెంపొందించుకోవాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రేడియంట్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్షరం మానవాళిని ఆలోచింపజేసిందని, పుస్తకం ప్రపంచ గతిని మార్చేసిందని చెప్పారు. అనుభవం, జ్ఞానం ఓ తరం నుంచి మరో తరానికి అందించే ఏకైక సాధనం పుస్తకమని అభిప్రాయపడ్డారు. వనపర్తి ప్రజలు కవులను, రచయితలను ప్రోత్సహించి, వారి రచనలను పుస్తక రూపంలో ఇక్కడి బ్రహ్మ విద్యా విలాస ముద్రాక్షరశాలలో అచ్చువేయించిన ఘనతను గుర్తుచేశారు. అనంతరం కళావేదిక ప్రతినిధులతో కలిసి జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, జనజ్వాల, బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, గ్రంథాలయ నిర్వాహకుడు శ్రీనివాస్, చెన్నయ్య, రాములు, శ్యామ్ సుందర్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల పాఠశాలకు పుస్తకాల వితరణ

వనపర్తి టౌన్: ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు 50 పుస్తకాలను వితరణ చేశారు. ఈ మేరకు వివిధ జాతీయ నాయకుల జీవిత చరిత్రలకు సంబంధించిన 50 పుస్తకాలను క్లాస్‌మేట్ క్లబ్ ప్రతినిధి నూర్జహాన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవికి అందించారు. జాతీయ నాయకుల జీవిత్ర చరిత్ర తెలుసుకోవడం ద్వారా విద్యార్థులు వారి జీవితాల్లో ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సువర్ణాదేవి, చెన్న పద్మ, సుబ్బలక్ష్మి, సరస్వతి, విజయలక్ష్మి, సుగుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని విరిగిన స్తంభాలు

గోపాల్‌పేట: గడ్డి ట్రాక్టర్ ఢీకొట్టడంతో రెండు కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయని తాడిపర్తి గ్రామస్తులు తెలిపారు. వివరాల మేరకు తాడిపర్తి గ్రామానికి చెందిన ట్రాక్టర్ గడ్డికి వెళ్తుండగా పెద్దమ్మ గుడి సమీపంలో ప్రమాదవశాత్తు కరెంటుపోల్‌ను ఢీకొట్టింది. దీంతో పక్కపక్కనే ఉన్న రెండు కరెంటు స్తంభాలు విరిగి పడ్డాయి. కరెంటు తీగలు రోడ్డు వెంట వెళ్తున్న ద్విచక్రవాహనంపై పడటంతో వాహనదారుడు కిందపడి గాయాలయ్యాయి. అదే సమయంలో కరెంటు పోవడంతో పెను ప్రమాదం తప్పింది. ట్రాక్టరు డ్రైవరు నిర్లక్ష్యంగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెప్పారు. ఘటన జరిగిన వెంటనే ప్రమాదస్థలానికి చేరుకుని సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దర కరెంటు తీసి వెంటనే సమస్యను పరిష్కరించామని ట్రాన్స్‌కో ఏఈ హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు.



విరిగిపడిన స్తంభాలు

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

కొత్తకోట రూరల్: విద్యార్థుల్లో పోటీతత్వం ఉన్నప్పుడే ప్రతిభ బయటకు వస్తుందని ప్రధానోపాధ్యాయులు శంకర్‌గౌడ్ అన్నారు. పెద్దమందడి మండలంలోని మనిగిల్ల జెడ్పీహెచ్‌లో మంగళవారం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. తరగతి వారీగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ బహుమతులు అందజేశారు. అంతేకాకుండా పాఠశాలకు అత్యధిక రోజులు హాజరైన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులను ఇచ్చి అభినందించారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని, అడ్వాన్స్ తరగతులు, అభ్యాస దీపికలు ఉపయోగించుకోవాల్సిందిగా విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం వెంకటేశ్వర్లుగౌడ్, నాగేశ్వరమ్మ, విష్ణువర్ధన్, శ్రీరాములు ఉన్నారు.

కొత్తకోట మండలంలో..

మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌తో పాటు సంకిరెడ్డిపల్లి, జెడ్పీహెచ్ఎస్ పాలెం, కేజీబీవీ అమడబాకుల, రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ కమిటీల సమావేశాల్లో జిల్లా విద్యాశాఖ కమిటీ మొబిలైజేషన్ అధికారి యుగంధర్ పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సమావేశాల యొక్క ప్రాధ్యాన్యతను వివరించడంతో పాటు బుధవారం నుంచి వేసవి సెలవులు ఉండటంతో పిల్లలపై తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో వచ్చిన విద్యార్థులను అభినందించారు.

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి నరేష్ 2023–24 విద్యా సంవత్సరంలో వంద శాతం హాజరు కలిగి ఉండటంతో మంగళవారం విద్యార్థిని పాఠశాల హెచ్ఎం పల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం అభినందించి బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థి పాఠశాల 215 రోజులు నడిస్తే గైర్హాజరు కాకుండా 215 రోజులు పాఠశాలకు హాజరయ్యాడని కొనియాడారు. మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నింపేందుకు ఆ విద్యార్థిని అభినందించి బహుమతి అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇంగ్లిష్ డిక్షనరీల అందజేత

పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశానికి గురుకుల పాఠశాలకు ఎంపి కావడంతో మంగళవారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జ్యోతినందన్‌రెడ్డి అందజేసిన ఇంగ్లిష్ డిక్షనరీలను విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులను అభినందిస్తూ, ఉపాధ్యాయ బృందాన్ని శాలువాలతో ఘనంగా సన్మానించారు.



అమడబాకుల కేజీబీవీ పాఠశాల విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం



జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో..

చోరీ ఘటనల్లో నలుగురి అరెస్ట్

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీల ఘటనల్లో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరావు తెలిపారు. మంగళవారం పెబ్బేరు పోలీస్‌స్టేషన్లో విలేకర్ల సమావేశంలో సీఐ రాంబాబు, ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డితో కలసి వివరాలను వెల్లడించారు. మంగళవారం ఉదయం కర్నూల్ బైపాస్ వద్ద తనిఖీల్లో బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని విచారించారు. కాగా వారి వద్ద రెండు బంగారు గొలుసులు ఉండగా ప్రశ్నించారు. సరిగా సమాధానం ఇవ్వకపోవడంతో అదుపులోకి తీసుకొన్నారు. చిన్నంబావి మండలం పెద్ద దగడకు చెందిన ఉడతల కృష్ణమూర్తి, కొత్తకోటకు చెందిన గుడిసె ఆదర్శ్, వనపర్తి మండలం అచ్యుతాపురంనకు చెందిన శ్రావణి, వనపర్తికి చెందిన డప్ప నాగమణి ముఠాగా ఏర్పడి జిల్లాలో చోరీలకు పాల్పడుతున్నట్లు వివరించారు. పెబ్బేరు మండలం జనుపల్లి, గుమ్మడం, వనపర్తి పట్టణంలోని గోపాల్‌పేట రోడ్డులో, కొత్తకోట మండలం నాటవెల్లి, గోపాల్‌పేట మండలం చాకల్‌పల్లి, పాన్‌గల్ మండల కేంద్రం, కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి గ్రామాల్లో చోరీలకు పాల్పడ్డామని నిందితులు ఒప్పుకున్నట్లు వివరించారు. వారితో 4 మొబైల్ ఫోన్లు, బైక్, 7 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తప్పనిసరి

పాన్‌గల్: వడదెబ్బ తగలకుండా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలు తప్పక పాటించాలని మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. మంగళవారం మండలంలోని జమ్మాపూర్, వెంగళాయిపల్లిలో గ్రామాల్లో ఆయన వైద్య సిబ్బందితో కలిపి పర్యటించి వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించడంతో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, మదన్ గోపాల్, రమాదేవి, శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన

పాన్‌గల్: క్షయ నివారణ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వెంగళాయిపల్లి, జమ్మాపూర్ గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య మాట్లాడారు. పది రోజులకు మించి జ్వరం, రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి వేళల్లో చెమటలు పట్టడం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం తదితర లక్షణాలు ఉంటే క్షయ అనుమానితులుగా భావించి వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలో ఎక్స్‌రే తీయించుకోవడం, తెమడ పరీక్ష సిబినాయట్, ట్రూనాయట్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, మదన్‌గోపాల్, రమాదేవి, శైలజ ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు మేలు



పెబ్బేర్‌లో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: పార్లమెంట్‌లో బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగం రద్దవుతుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం పెబ్బేరు మండల కేంద్రంలోని సుభాష్‌చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో ఆయన, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. శాసనసభ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బిజినేపల్లి కాంగ్రెస్ సభలో టెంట్లు కూలిపోయినట్లే ప్రభుత్వం కూడ త్వరలోనే కూలిపోతుందని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది పేద విద్యార్థులకు దారి చూపించిన వ్యక్తి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి, బీఆర్ఎస్ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, వనం రాములు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని వనపర్తి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ బైకాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.



మల్కిమియాన్‌పల్లిలో..

మంగళవారం మండలంలోని కంచిరావుపల్లిలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మున్సిల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు స్థానిక నాయకులతో కలిసి ఉపాధి పనుల వద్ద కూలీలకు కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ విజయ్, నాయకులు పెద్దింటి వెంకటేష్, గోవిందు, రాజశేఖర్, ఎల్లారెడ్డి, రామచంద్రయ్య, మధు, యాదగిరి, గోపాల్, వడ్డె రమేష్, ఆంజనేయులు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎంపీపీ కృష్ణానాయక్, మండల ఇన్‌చార్జ్ నందిమల్ల అశోక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ మంగళవారం వారు మండలంలోని అల్లమాయపల్లి, మల్కిమియాన్‌పల్లి, మామిడిమాడ తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. అల్లమాయపల్లిలో ఉపాధి హామీ కూలీలను కలిసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సాయిలు, బాలాంజనేయులు గౌడు, మన్నెంగౌడు, అంజనేయులు గౌడు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీ సమీపంలో నివాసం ఉంటున్న వెంకటేష్, పల్లవి దంపతుల ఏడేళ్ల కుమారుడు దుర్గాప్రసాద్ రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బాలుడిని హైదరాబాద్‌లోని రైల్వే క్వాటర్స్‌లో పోలీసులకు దొరికాడు. వారు బాలుడిని అడ్రస్ అడుగగా కొత్తకోట అని చెప్పడంతో వారు స్థానిక పోలీసులకు బాలుడి ఫొటో పంపించారు. దీంతో కొత్తకోట పోలీసులు వాట్సాప్‌లో వైరల్ చేయగా 11వ వార్డు బీఆర్ఎస్ నాయకుడు అయ్యన్న సహకారంతో బాలుడి తల్లిదండ్రులు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డిని ఆశ్రయించారు. దుర్గాప్రసాద్ తమ కుమారుడేనని చెప్పడంతో వారు హైదరాబాద్‌లోని రైల్వే పోలీసుల నుంచి బాలుడిని తీసుకొచ్చి మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమారుడిని అప్పగించిన రైల్వే పోలీసులకు, కొత్తకోట పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి

బోరు స్టార్టర్, పైపు ధ్వంసంపై ఫిర్యాదు

పాన్‌గల్: బోరు మోటార్ స్టార్టర్, పైపు ధ్వంసం చేసిన ఘటనపై మంగళవారం ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ వేణు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన మూసిని పార్వతమ్మ, మూసిని రవీందర్‌బాబు దాయాదులు. ఇద్దరి మధ్య భాగ పరిష్కారం గొడవలు ఉన్నాయి. ఈ గొడవలను మనస్సులో ఉంచుకొని పార్వతమ్మ పొలంలోని బోరు స్టార్టర్, పైపును ఈనెల 20వ తేదీన రవీందర్‌బాబు ధ్వంసం చేశారు. దీనిపై పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థినులకు సన్మానం



అమరచింత: మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతూ సీఓఈ పరీక్షలో ప్రతిభ చూపి సీటు సాధించిన విద్యార్థినులకు మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు సన్మానించారు. పాఠశాలకు చెందిన తస్లీమా ఎంపీసీలో, హరిక ఈఎంలో సీటు సాధించినట్లు ప్రధానోపధ్యాయుడు బలరాముడు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజ్‌కుమార్, ఉపద్యాయులు స్వామి, రాజేష్, దేవేంద్రం, విజయ ప్రకాష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

లండన్ బ్రిడ్జిపై యూత్ కాంగ్రెస్ నాయకుల ప్రదర్శన



లండన్ బ్రిడ్జిపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యూత్ కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సభ్యులు

వనపర్తి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మంగళవారం ఎన్ఆర్ఐ యూత్ కాంగ్రెస్ శ్రేణులు లండన్ బ్రిడ్జిపై ప్లకార్డులు ప్రదర్శించారు. వనపర్తి నియోజకవర్గంలోని యూత్ కాంగ్రెస్ శ్రేణుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకుగాను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సారథ్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని యూత్ కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సభ్యులు అనిల్‌కుమార్, అమర్‌పాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, కిట్టు, నగేష్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక పార్లమెంట్ సీట్లు దక్కించుకోవడం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు.